క్లుప్తంగా

మనాలిలో ఏయూ విద్యార్థుల బృందం



మనాలి సాహస శిబిరంలో పాల్గొంటున్న ఏయూ విద్యార్థుల బృందం

విశాఖ విద్య: మనాలిలో జరుగుతున్న జాతీయ సేవా పథకం వలంటీర్ల ప్రత్యేక సాహస శిబిరానికి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పది మంది విద్యార్థుల బృందం వెళ్లింది. వీరు రాక్ క్లైమ్బింగ్, రివర్ రాఫ్టింగ్ వంటి సాహస కృత్యాల్లో భాగస్వాములవుతారు. న్యాయ కళాశాల ఆచార్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పల్లవి సారథ్యంలో మనాలి పర్యటనకు వెళ్లిన విద్యార్థులు సాహస శిబిరంలో ప్రత్యక్షంగా పాల్గొంటారు.

విశాఖలో వీసా దరఖాస్తుల స్వీకరణ కేంద్రం



రెబెకాను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ బృందం

బీచ్‌రోడ్డు: భారత్ – అమెరికాల మధ్య సాంకేతిక పరంగా పరస్పర మార్పిడి అవసరమని, ఈ నేపథ్యంలో విశాఖలో వీసా దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని యూఎస్ కాన్సులేట్ కాన్సులర్ చీఫ్ రెబెకా అన్నారు. రెబెకా బృందంతో గురువారం విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో వీసాల రోజువారీ జారీ కోసం 1,600 ఇంటర్వ్యూలు చేస్తున్నారన్నారు. దీన్ని రోజుకు 2,500కి గణనీయంగా పెంచాలనే తమ లక్ష్యాన్ని తెలియజేశారు. వైజాగ్‌లో వీసా దరఖాస్తు కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలున్నాయని రెబెకా పేర్కొన్నారు. అనంతరం ఐటీఏపీ అధ్యక్షురాలు లక్ష్మి ముక్కవిల్లి మాట్లాడుతూ భారతదేశంలో ఐటీ రంగం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక జీవనమే ఉన్నతం



సోక్రటీస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

విశాఖ విద్య: ఆధ్యాత్మిక జీవనమే ఉన్నతమైనదని ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజకుమారి అన్నారు. వరల్డ్ ఫిలాసఫీ డే సందర్భంగా గురువారం ఏయూ ఐఏఎస్ఈ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి రోజుల్లో ఆధ్యాత్మిక జీవన విధానమే ఉన్నతమైనదన్నారు. సమాజంలో తత్వశాస్త్ర బోధనలకు సోక్రటీస్ దిక్సూచీగా నిలిచారని గుర్తుచేశారు. ముఖ్య అతిథి విశ్రాంత ఆచార్యుడు మదన్ మోహన్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందో, వివేకానంద వంటివారి ఆధునిక తత్వం గొప్పతనాన్ని, వారు చెప్పిన ఉన్నత విలువలను గురించి వివరించారు. సోక్రటీస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమలాంబ, సహ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ బి.సన్యాసిరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 75 యూనిట్ల రక్తం సేకరించామన్నారు. ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ సాగదీత..?

నత్తనడకన టీటీడీ కూడలి ఆధునికీకరణ

ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో వృత్తాకారంలో నిర్మిస్తున్న ఫౌంటెయిన్



- 6 నెలల్లో మూడు సార్లు ఆగిన పనులు
- నిర్మాణ సామగ్రితో అధ్వానంగా కూడలి
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల విమర్శలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ నత్తనడకన సాగుతోంది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం(ప్రాజెక్ట్స్) ఈ కూడలి సుందరీకరణ పనులు గతంలో చేపట్టింది. నగర వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్‌లో భాగంగా టీటీడీ కూడలిని సైతం ఆధునికీకరిస్తున్నారు. గత 6 నెలలుగా ఈ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మూడు సార్లు నిలిచిపోయాయి. దీంతో పనుల నిర్వహణలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

అస్తవ్యస్తంగా కూడలి

ఆధునికీకరణ పనుల నిమిత్తం టీటీడీ కూడలిలో డంప్ చేసిన నిర్మాణ సామగ్రి, రాక్ బ్రిక్స్, కాంక్రీట్ పొడి అక్కడే వదిలేయడంతో పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ సామగ్రి కారణంగా ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడుతోంది. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్, అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానికులు, వాహన చోదకులు విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి టీటీడీ కూడలి ఆధునికీకరణ త్వరితగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.



టీటీడీ కూడలిలో ఆధునికీకరణ పనులు

పనులకు నిత్యం అంతరాయం

దాదాపు కోటి రూపాయలకు పైగా వ్యయంతో టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు గతంలో జీవీఎంసీ వెల్లడించింది. సర్కిల్ బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి, ఫౌంటెయిన్ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఇందుకు అనుగుణంగా జంక్షన్ లోపల కొత్త మట్టిని వేశారు. ఫౌంటెయిన్ నిర్మాణానికి వృత్తాకారంలో గోడలు కట్టారు. వాటి మధ్యలో పిల్లర్స్ సైతం నిర్మించారు. ఈ పనుల్లో నిత్యం అంతరాయం ఏర్పడటంతో ఆధునికీకరణ ఎప్పుడు పూర్తవుతుందోనని స్థానికుల్లో సందేహం నెలకొంది. వారం రోజుల పాటు పనులు చేయడం.. మళ్లీ నెలల తరబడి నిలిపేయడం చందంగా ఇక్కడ పనులు జరుగుతున్నాయి.



కూడలిలో వదిలేసిన నిర్మాణ సామగ్రి

తత్వశాస్త్రంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తత్వశాస్త్ర శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు అధ్యక్షత వహించగా, తత్వశాస్త్ర విభాగ పూర్వాచార్యుడు వై.వి.సత్యనారాయణ 'నైతికత రాజకీయ బాధ్యత' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తాత్వికంగా, తర్కబద్ధమైన ఆలోచన అనుసరించడం ద్వారా జీవితంలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఆచార్య ఎం.వి.కృష్ణయ్య మాట్లాడుతూ సోక్రటీస్ జన్మదినం రోజున అంతర్జాతీయ తత్వశాస్త్ర దినోత్సవంగా మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుండటం శుభపరిణామమన్నారు. ఆచార్య వెంకటరావు మాట్లాడుతూ ఈ ఏడాది 'సమష్టి, స్థిరమైన భవిష్యత్తు కోసం తత్వశాస్త్రం' అనే అంశంపై చర్చలు జరపాల్సి ఉందన్నారు. అధ్యాపకుడు డాక్టర్ ముసుగు ప్రసాద్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అల్లాడ వీరభద్రరావు, డాక్టర్ బి.పి.ఎస్.కల్యాణి, డాక్టర్ ఎ.పద్మజ, డాక్టర్ దాక్షాయిని, డాక్టర్ దేవదానం, డాక్టర్ జె.శ్రీనివాసరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ బీఆర్ రావు సేవలు అమోఘం



బీఆర్ రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం ఆచార్య బీఆర్ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏయూ ప్రాంగణంలోని ఫిజిక్స్ విభాగం వద్ద గల ఆయన విగ్రహానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలో, విద్యా రంగంలో ఆచార్య బీఆర్ రావు అందించిన అద్భుతమైన సేవలతో ప్రపంచం ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుందన్నారు. ఏయూలో స్పేస్ ఫిజిక్స్ లేబరేటరీ ఏర్పాటు చేయడంలో బీఆర్ రావు చేసిన కృషిని వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో విశేష గుర్తింపును తీసుకొచ్చారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు, ఏయూ పూర్వ రెక్టార్ ఆచార్య కె.సమత, డీన్ ఆచార్య కె.బసవయ్య ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్, వివిధ శాఖాధిపతులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు, మత్స్యకార సంఘం నేతలు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు గురుకులం విద్యార్థులు



ఇండస్ట్రియల్ విజిట్‌కు బయలుదేరిన శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు గురువారం ఇండస్ట్రియల్ విజిట్ చేశారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలతో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు చదువుతున్న విద్యార్థులు వృత్తి విద్యలో భాగంగా సింహాచలంలోని డీఎన్జీ ఫ్యామిలీ సెలూన్ అండ్ బ్యూటీ పార్లర్‌ను సందర్శించినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఈ విజిట్‌లో విద్యార్థులు పలు కొత్త అంశాల గురించి తెలుసుకున్నారన్నారు. దీనివల్ల వారికి వృత్తి విద్యపై ఆసక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జీసీడీవో కలేశా బేగం, ఒకేషనల్ కోఆర్డినేటర్ రిసికేష్, గురుకులం వైస్ ప్రిన్సిపాల్ బి.కె.రమేష్, ఒకేషనల్ ట్రైనర్ ఎస్.ద్రాక్షాయిని పాల్గొన్నారు.

ఏయూలో మొక్కల పెంపకానికి ముందుకొచ్చిన వీసీటీపీఎల్



ఏయూ వీసీ శశిభూషణరావును కలిసిన వీసీటీపీఎల్ ప్రతినిధుల బృందం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విస్తృత స్థాయిలో మొక్కలు పెంచడానికి వీసీటీపీఎల్ ముందుకొచ్చింది. గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో వీసీటీపీఎల్ సీనియర్ జీఎం ఎం.ఎన్.రావు, ఏఎం(పీఆర్) ధనుంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఏయూలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటుతామని హామీ ఇచ్చారు. దీనికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ఏయూ అధికారులు తమకు అప్పగిస్తే మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని సైతం చేపడుతామని తెలిపారు. ఈ సందర్భంగా వీసీటీపీఎల్ అధికారులకు, ఈ ప్రతిపాదనను పంపిన టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీలకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభిద్దామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏయూ వృక్షశాస్త్రం విభాగం ఆచార్యులు, హార్టికల్చరల్ విభాగం డీన్ ఆచార్య ఎస్.బి పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రామారావుకు నివాళి



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరామయ్య తదితరులు

ఎంవీపీకాలనీ: వ్యాపారవేత్త బీవీ రామారావుకు పలువురు జిల్లా ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్య కారణాలతో రామారావు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. వెంకోజీపాలెంలోని ఆయన నివాసంలో గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. పలువురు నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వ్యాపార రంగానికి రామారావు అందించిన సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, దాడి వీరభద్రరావుతోపాటు రామారావు భార్య సతీసావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారుడు బీవీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదపై అవగాహన

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జువాలజీ – ఫిషరీస్ విభాగం విద్యార్థులు జాలరిపేట, వాల్తేరు డిపో ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ప్రారంభించి మాట్లాడారు. మత్స్య సంపద ఎలా వృద్ధి చేసుకోవాలలో వివరించారు. చేపలను కాపాడుకోవడం, వలలు వాడే విధానాలపై సూచనలిచ్చారు. విద్యార్థులందరూ ఇంటింటికీ వెళ్లి చిన్న చేపలను కాపాడుకోవడం, పెద్ద వలలు వినియోగించడంపై అవగాహన కల్పించారు. డాక్టర్ టి.భూషణ్‌రావు, డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్, పి.లక్ష్మణ్, ప్రవీణ పాల్గొన్నారు.

'మెగాస్టార్ ఫ్యాన్' అందరి సినిమా



మెగాస్టార్ ఫ్యాన్ చిత్ర యూనిట్ సందడి

బీచ్‌రోడ్డు: మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం అందరి హీరోల అభిమానులు చూడాల్సిన సినిమా అని డైరెక్టర్ కిరణ్ వారియర్ అన్నారు. మెగాస్టార్ ఫ్యాన్ మూవీ ప్రమోషన్‌లో భాగంగా గురువారం పెదవాల్తేరు అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానిగా ఈ సినిమా తీశానని, హీరో లుక్స్ రాజ్, హీరోయిన్ సోనిరెడ్డి చక్కగా నటించారన్నారు. 41 రోజుల పాటు యలమంచిలి, తుని వంటి ప్రాంతాల్లో షూటింగ్ చేశామన్నారు. నిర్మాత కంచర్ల అచ్యుతరావు సహకారంతో ఈ నెల 29న సినిమా విడుదల చేస్తున్నామని తెలిపారు. యువ హీరో కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ అందరి హీరోల అభిమానులకు ఈ సినిమా నచ్చుతుందన్నారు. నిర్మాత అల్లు శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ ఈ సినిమాలో నటులందరూ కష్టపడి పనిచేశారని, ఇద్దరు హీరోలు, హీరోయిన్లతో కథ నడుస్తుందన్నారు. నటుడు సూర్య, రెండో హీరోయిన్ భువన సీత, ఎడిటర్ శ్యాంకుమార్, నటుడు గణేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ 11 కేవీ హనుమంతవాక ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పెదగదిలి, సాలిపేట, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య విభాగం కార్యాలయం, ప్రభుత్వ బాలుర గృహాలు, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొత్త వెంకోజీపాలెం పరిధిలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సెక్టార్-1 కొత్త వెంకోజీపాలెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యుల చెంతకు సంతోషిలక్ష్మి



సంతోషిలక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు

ఆరిలోవ: వారం రోజుల కిందట అదృశ్యమైన ఓ వివాహిత ఆచూకీ లభ్యమైంది. ఆరిలోవ పోలీసులు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. మానసికంగా అనారోగ్యంతో కొన్నేళ్లుగా బాధపడుతున్న ఆరిలోవ అప్సరా కాలనీకి చెందిన గోకాడ సంతోషిలక్ష్మి ఈ నెల 16న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరలేదు. ఆమె తండ్రి పి.జగన్నాథం 17న ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా విజయవాడలోని కనకదుర్గాదేవి గుడి వద్ద ఒంటరిగా తిరుగుతున్న సంతోషిలక్ష్మిని ఓ ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించినట్లు తెలుసుకున్నారు. ఆమెను గురువారం విజయవాడ నుంచి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె ఆచూకీ తెలుసుకొని ఆరిలోవ తీసుకొచ్చిన పోలీస్ సిబ్బందిని సీఐ మల్లేశ్వరరావు అభినందించారు. సంతోషిలక్ష్మి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ లుంబినీ పార్కు వద్ద బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులపై జరిగిన దాడి ఘటనలో ఎంవీపీ కాలనీ నేరవిభాగం పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. క్రైం ఎస్ఐ రాజు తెలిపిన వివరాలిలా.. కొత్తవలసకు చెందిన డి.బాల మురళీకృష్ణ, తుని ప్రాంతానికి చెందిన కోసం శ్రీనివాసరావు పని నిమిత్తం ఇటీవల నగరానికి వచ్చారు. బుధవారం రాత్రి అప్పుఘర్‌లోని లుంబినీ పార్కు వద్ద వీరు మద్యం తాగుతుండగా.. అక్కడికి నలుగురు స్థానిక యువకులు వచ్చి డబ్బులు ఇవ్వాలని వారిని బెదిరించారు. వారు ఎందుకు ఇవ్వాలని వారించడంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మురళీకృష్ణ, శ్రీనివాసరావులపై దాడి చేసి వారి వద్దనున్న డబ్బులతోపాటు సెల్‌ఫోన్ అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందడంతో గాయాలైన మురళీకృష్ణ, శ్రీనివాసరావులను ఎంవీపీ పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనం, దాడిపై కేసు నమోదు చేసిన నేర విభాగం పోలీసులు వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీలను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు ఎద్దు రాజు కోసం గాలిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

చిరువ్యాపారుల పాలిట రాక్షసుడు పీతల మూర్తి

- ఆయన వేధింపుల నుంచి విముక్తి కల్పించండి
- తోపుడుబండ్లు, చిల్లర వ్యాపారుల ర్యాలీ, నిరసన



సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దిలపాలెం వద్ద నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చిరువ్యాపారుల పాలిట రాక్షసుడని, ఆయన వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని రోడ్డున పడ్డ తోపుడుబండ్ల వ్యాపారులు కోరారు. గురువారం ర్యాలీ నిర్వహించి, కళాభారతి ఆడిటోరియం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిరు వర్తకులు బన్నీ, నిషా మాట్లాడుతూ కార్పొరేటర్ మూర్తి యాదవ్ తోపుడుబండ్ల వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజాలనుకున్నారన్నారు. తమ తాతల కాలం నుంచి 30, 40 ఏళ్లుగా లైసెన్స్‌లతో వ్యాపారం చేసుకుంటూ ప్రభుత్వానికి రూ.20 ఆశీలు కడుతున్నామని తెలిపారు. మీకెందుకు డబ్బులివ్వాలని మూర్తి యాదవ్‌ను ప్రశ్నించినందుకు.. ఆయన తమపై హైకోర్టులో కేసు వేశారన్నారు. దీంతో తోపుడుబండ్ల వ్యాపారం చేసే 335 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను చూసే పీతల మూర్తిని గెలిపించామని, లేకుంటే ఆయన ఎవరో తమకు తెలియదని తోపుడుబండ్ల వ్యాపారులు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ఉపాధికి రక్షణ కల్పించాలని 22వ వార్డు తోపుడుబళ్ల వ్యాపారులు, కళాభారతి తోపుడుబళ్ల సంఘం సభ్యులు కోరుతున్నారు.

చిరువ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో సోమవారం సంత, బడ్డీలు, తోపుడుబండ్ల తొలగింపునకు వ్యతిరేకంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు 120 మందితో ర్యాలీ చేశారు. మద్దిలపాలెం జోన్ తోపుడుబండ్ల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ తొలగించిన తోపుడుబండ్లు, చిరు వర్తకులను, సోమవారం సంతను యథావిధిగా కొనసాగించి, వారికి ఉపాధికి రక్షణ కల్పించాలని జీవీఎంసీ అధికారులను కోరారు. వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చిల్లర వర్తకులపై కక్ష సాధింపుతో హైకోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చి వారిపై దాడి చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం చిరువ్యాపారులపై దాడులు ఆపాలని, డబ్బున్న వారికి కొమ్ముకాస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తిని జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తోపుడుబండ్ల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ స్వయం ఉపాధితో బతుకుతున్న తోపుడుబండ్లు, సోమవారం సంత వ్యాపారులను తొలగించడం ద్వారా సుమారు 300 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. పడగొట్టిన బడ్డీలు, తోపుడుబళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, పిఠాపురం కాలనీ తోపుడుబండ్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బన్నీ, నిషా, సోమవారం సంత చిల్లర వర్తకులు, తోపుడుబళ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈ నెల 26న తలపెట్టిన ఊరేగింపులు, బహిరంగ సభలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సీఐటీయూ నాయకులు హనుమంతవాక వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ మట్లాడుతూ ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రైతు కిషన్ మోర్చా ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ పార్కు వరకు మహా ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభను కార్మికులంతా జయప్రదం చేయాని పిలుపునిచ్చారు. ఆటో, ముఠా బిల్డింగ్ వర్కర్లు, చిరు వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణరావు, సూరిబాబు, రాజేష్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణను అడ్డుకున్న స్థానికులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పార్వతీనగర్‌లోని జీవీఎంసీ స్థలం ఆక్రమణకు గురైంది. విషయం తెలుసుకున్న స్థానికులు ఈ ఆక్రమణను గురువారం అడ్డుకుని ఆక్రమణదారుని నిలదీశారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీనగర్, సూర్యతేజనగర్ మీదుగా చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరం మధ్యలో గతేడాది రోడ్డు విస్తరణ జరిగింది. పార్వతీనగర్ వద్ద వంతెనను కూడా విస్తరించి కొత్తగా నిర్మించారు. ఈ విస్తరణలో రోడ్డు పక్కన ఇళ్లు, ఇంటి భాగాలు కోల్పోయిన వారికి జీవీఎంసీ అధికారులు నష్టపరిహారంగా టీడీఆర్‌లు ఇచ్చారు. పార్వతీనగర్ వద్ద గెడ్డ అంచున ఓ మహిళకు కూడా ఇంటి భాగాన్ని కోల్పోయినందుకు టీడీఆర్ అందించారు. ఆమె తనకు చెందిన మిగిలిన ఇంటి భాగానికి, గెడ్డకు మధ్యలో ఖాళీ స్థలాన్ని ఆక్రమించారు. దానిని ఓ వ్యాపారికి టిఫిన్ సెంటర్ కోసం అద్దెకు ఇచ్చేసింది. ఆ ఇంట్లో నుంచి ఖాళీ స్థలానికి ద్వారం కూడా ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలంలో షెడ్ నిర్మాణం కోసం గురువారం చదును చేసి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆ స్థలం ఆక్రమణను అడ్డుకొని పనులు నిలిపేశారు. టీడీఆర్ తీసుకొని ఖాళీ స్థలాన్ని మళ్లీ ఎలా ఆక్రమిస్తావంటూ ఆక్రమణదారుని నిలదీశారు. సచివాలయ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఇంతలో 13వ వార్డుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు అక్కడికి చేరుకొని జీవీఎంసీ స్థలంలో షెడ్ వేసుకుంటే మీరెందుకు అడ్డుకుంటున్నారు, మీకొచ్చిన ఇబ్బంది ఏంటంటూ స్థానికులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు ఆ నాయకుడిపై తిరగబడటంతో మెల్లగా అక్కడ నుంచి జారుకున్నాడు. సచివాలయం సిబ్బంది, జీవీఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విశేషం.

గిరిజన ప్రాంతాల్లో చట్టాల అమలుపై అవగాహన

ఎంవీపీకాలనీ: ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం గెస్ట్ లెక్చర్స్ నిర్వహించారు. 'ట్రైబల్ లా, కస్టమ్స్ అండ్ జ్యుడీషియరీ త్రూ ది ఏజెస్ ఇన్ ఇండియా: స్పెషల్ రిఫరెన్స్ టు ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఈ ఉపన్యాసాలు జరిగాయి. జన్‌జాతీయ గౌరవ్ దివస్-2024లో భాగంగా గిరిజన స్వతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండాకు వక్తలు నివాళులర్పించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి గిరిజన ప్రాంతాల్లో చట్టాల అమలుపై అవగాహన కల్పించారు. గిరిజనుల జీవన విధానం, సంప్రదాయాలు, భూములు, సహజ వనరులపై వారి హక్కులను తెలియజేశారు. సంక్షేమ పథకాలు గిరిజనలకు అందించడంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, గిరిజనులకు రక్షణ అంశాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు ఐటీడీఏ అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.